క్లుప్తంగా

శాకాహారంపై ర్యాలీ



మాచర్ల: శాకాహారంపై బాపట్ల జిల్లా, చీరాల పిరమిడ్ ధ్యాన మందిరం, మాచర్ల పిరమిడ్ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ జరిగింది. శాకాహారం అమృతహారం, జీవులను హింసించకూడదని మహాత్మా గాంధీ బోధనలను గుర్తుచేశారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్ నుంచి రింగ్ రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.

కన్నమదాసుకి అవమానం



దాచేపల్లి: పల్నాటి యుద్ధంలో బ్రహ్మనాయుడికి సర్వ సైన్యాధ్యక్షుడిగా వ్యవహరించిన కన్నమదాసుకి ఘోర అవమానం కలిగింది. ఆ మహనీయుడి విగ్రహం కిందపడవేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. నారాయణపురంలోని ఆర్అండ్బీ బంగ్లా వెనుక పడవేసిన కన్నమదాసు విగ్రహం తుప్పుపట్టి పాడైపోతుంది. గతంలో కారంపూడి రోడ్డు సెంటర్లో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అద్దంకి–నార్కెట్పల్లి హైవే రోడ్డు విస్తరణలో విగ్రహాన్ని తీసి బంగ్లాలో పెట్టారు. నాటి నుంచి నేటి వరకు ఈ విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించేందుకు ఏ ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు కన్నమదాసు విగ్రహాన్ని యథాస్థానంలో పునఃప్రతిష్ఠించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



మాచర్ల: కో–ఆపరేటీవ్ బ్యాంకు ఆధ్వర్యంలో శ్రీచైతన్య పాఠశాల ఆవరణంలో సహకార సంఘం విధి విధానాలు, బ్యాంకు పనితీరుపై విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డిక్షనరీలు అందజేశారు. పాల్గొన్న 30 మంది విద్యార్థులకు పెన్నులు అందజేశారు. బ్యాంకు తరుపున స్వరూపారాణి, శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బ్యాంకు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ కోటయ్య ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

పీ4పై అవగాహన సదస్సు



మాచర్ల: మండల స్థాయి నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించే లక్ష్యంతో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలని వెలుగు ప్రాజెక్టు మండల అధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మాచర్ల సమాఖ్య ఆధ్వర్యంలో యానిమేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎ.సరస్వతి అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం పీ4, స్వయం ఉపాధి, పలు కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక చేయూతనందిస్తుందన్నారు. నిరంతరం వీటిపై అవగాహన కల్పిస్తూ చైతన్య పర్చడం జరుగుతోందన్నారు. సదస్సులో పీఓలు రామయ్య, జమాల్ సైదా, ఆర్.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు రుణ మేళా

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికి బుధవారం ఉదయం 10 నుంచి పురపాలక సంఘ కార్యాలయంలో రుణ మేళా ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణ మేళాకు బ్యాంకు మేనేజర్లు హాజరవుతారని, గతంలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారందరూ సంబంధిత దరఖాస్తు కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం తోపాటు, పాన్కార్డు, రేషన్ కార్డులతో హాజరు కావాలని పేర్కొన్నారు.

వైఎస్సార్సీపీ కార్యకర్త మృతి

మాచర్ల: మండలంలోని పెద్ద అనుపు చెంచుకాలనీకి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పెద్ద మల్లిరాజు (30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాచర్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు పోతిరెడ్డి కోటిరెడ్డి, పార్టీ గిరిజన విభాగం జిల్లా అధ్యక్షుడు మున్షావత్ రంగానాయక్, జెడ్పీటీసీ మండి స్వామి మంగళవారం మల్లిరాజు మృతదేహాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: మున్సిపల్ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ అన్నారు. మంగళవారం పట్టణంలోని బంగ్లా సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టర్, ఔట్సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరారు. సబ్బులు, చెప్పులు, యూనిఫామ్, వెంటనే ఇవ్వాలన్నారు. పండగల సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అకారణంగా తొలగించిన కాంద్రగుంట మేరమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిలక సునీత, భక్తుల రామారావు, మొగిలి ప్రతాప్, కంప సాగర్బాబు, జయమ్మ, అన్నపూర్ణ, మేరమ్మ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాల్వల మరమ్మతులు చేపట్టాలి

అధికారులకు ప్రజా సంఘాల వినతి



మాట్లాడుతున్న పీడీఎం నాయకులు

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాల్వ పరిధిలో ఉన్న కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టి నీరు సక్రమంగా పారేవిధంగా చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో మీడియాతో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. దశాబ్దాలు గడుస్తున్నా కాలువల రిపేర్లు చేయకుండా, ప్రతి ఏడాది బడ్జెట్లో మాత్రం నిధులు కేటాయించడం మాత్రం జరుగుతుందన్నారు. ఆ నిధులతో పనులు ఎక్కడ జరుగుతున్నాయో ఎవరికీ స్పష్టత ఉండటం లేదన్నారు. నరసరావుపేట, వినుకొండ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట ఎక్కడ చూసినా కాలువల్లో పిచ్చిచెట్లు మొలవటం, కంప చెట్లతో నిండి ఉండటం, కాలువలు తెగి ఊర్ల మీద, పంట పొలాల మీద పడటమనేది అనేక మార్లు జరుగుతున్నాయన్నారు. స్థానిక అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదని అన్నారు. గ్రీవెన్స్లో కలెక్టర్కు అర్జీలిచ్చినా పరిష్కారాలు కావట్లేదని, ఎన్ఎస్పీ అధికారులు అంచనాలు వేసి పైకి పంపుతున్నామని, అనుమతులు, బడ్జెట్ కేటాయింపులు పూర్తికాగానే పనులు మొదలు పెడతామంటూ ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారన్నారు. కాలవలను పట్టించుకునే వాళ్లే లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో ఆక్రమణకు లోనవుతున్నాయని, ఎన్ఎస్పి అధికార యంత్రాంగం మౌనంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి నాగార్జున సాగర్ పరిధిలో ఉన్న కాలువలు రిపేర్లు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రాము, బీసీ సంక్షేమసంఘ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మవారికి ఘనంగా కుంకుమ పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాలుగుడి దేవస్థానంలో నవరాత్రుల మహోత్సవంలో భాగంగా మంగళవారం మహా సరస్వతీ అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. మహిళా భక్తులు విశేషంగా హాజరై మహా సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

రూ. 4.06 కోట్లు పన్ను వసూళ్లు

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘం పరిధిలో ఆస్తి, నీటి పన్నుకు సంబంధించి రూ.7 కోట్ల బకాయి ఉందని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు మంగళవారం తెలిపారు. పన్ను చెల్లింపు గడువు మార్చి 31వ తేదీ సాయంత్రానికి రూ.4.06 కోట్లు వసూలు అయినట్లు వెల్లడించారు. మూడు నెలలుగా పురపాలక సంఘ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి, అన్ని ప్రాంతాల్లో నోటీసులు అందించి ప్రజలను చైతన్య వంతులను చేశారని చెప్పారు. 54 శాతం పన్ను వసూలు చేసినట్లు వెల్లడించారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

వంతెన పైనుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన అజయ్



ఒడిశాకు చెందిన వలస కార్మికుడు

యడ్లపాడు: సినీ తరహాలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... సత్తెనపల్లికి చెందిన ఆళ్ల అజయ్ ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు ప్రయాణిస్తుండగా, యడ్లపాడు గ్రామంలోని ఎరక్రొండ వద్ద హైవే వంతెనపై నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. వేగంగా ఉన్న బైక్ అదుపతప్పి వంతెన గోడను బలంగా ఢీకొంది. దీంతో గాల్లోకి ఎగిరిన అజయ్ వంతెన పైనుంచి కింద ఉన్న సర్వీసు రోడ్డులోకి వచ్చి పడ్డాడు. ఈ ప్రమాదంలో బైక్కు అడ్డు వచ్చిన వ్యక్తితో పాటు సర్వీసులో పడిపోయిన యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన వారిని 108 వాహనం ద్వారా గుంటూరు జీజీహెచ్కు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని వివరాలను సేకరించారు. రోడ్డు దాటుతూ బైక్ తగిలి గాయపడ్డ వ్యక్తి సమీప నూలుమిల్లులో పని చేసే ఒడిశాకు చెందిన వలస కార్మికుడిగా పోలీసులు భావిస్తున్నట్లు ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపారు.

ఉపాధ్యాయుడికి అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం



పిడుగురాళ్ల: తెలుగు బాషా పండితుడిగా పని చేస్తూ విద్యా రంగంలో 36 సంవత్సరాలు సుదీర్ఘ అనుభవం కలిగిన తిరునగరి సత్యానారాయణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు సదరన్ ప్రైవేటు లెక్చరర్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్టీయూ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి. నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

బాలికను వేధించిన కేసుపై విచారణ

నాదెండ్ల: పట్టణంలోని వివాహిత మహిళకు కొన్నాళ్లకు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత వేరే వ్యక్తితో సహజీవనం చేస్తూ మొదటి భర్తకు విడాకులు ఇచ్చింది. సహజీవనం చేస్తున్న వ్యక్తితో ఉంటూ భర్త దగ్గర ఉన్న పిల్లలని అప్పుడప్పుడు పాఠశాల వద్దకు వెళ్లి కలుస్తూ పాపని ఇంటికి తీసుకొని వస్తూ ఉండేది. ఈ క్రమంలో డిసెంబర్లో అంగన్వాడీ కేంద్రంలో చదువుకునే పాపని తన వద్దకు తీసుకొని వచ్చింది. ఆ తర్వాత రోజు కొడుతూ చిత్రహింసలు పెడుతూ బెల్టుతో కాళ్ళు, చేతులు మీద కొట్టటమే కాకుండా, వంటిమీద పలుచోట్ల కాలుస్తూ చిత్రహింసలకు గురి చేసేది. దూరంగా ఉన్న భర్త, నాయనమ్మ ఇంటి వద్దకు వెళ్తూ ఉండగా పాపా రోడ్డుమీద ఆడుకుంటూ స్పృహ తప్పి పడిపోయి ఉండటంతో తండ్రి నాయనమ్మ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి పోలీసు మీడియాకు సమాచారం తెలియజేశారు. ఈ ఘటన నిన్న మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి కసాయితల్లి, ప్రియుడి గురించి విచారణ చేపట్టారు. మంగళవారం పల్నాడు జిల్లా డీసీపీఓ, నాదెండ్ల సీడీపీఓ పాప నివాసం వద్దకు వెళ్లి పాపకు జరిగిన అన్యాయం మీద విచారణ చేపట్టి వివరాలు సేకరించారు.

వృద్ధులకు అన్నదానం

గురజాల రూరల్: స్థానిక పాతపాటేశ్వరి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు, యాచకులకు అన్నదానం చేశారు. దాచేపల్లికి చెందిన మార్కాపురం మోహన్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీ విశ్వనాథం, బండి రవికుమార్ పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోండి

రెంటచింతల: మండల పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సర్వీస్కు అధిక లోడ్ ఉంటే 50 శాతం రాయితీపై అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని ఏపీ ట్రాన్స్కో ఏఈ షేక్ మస్తాన్వలి మంగళవారం తెలిపారు. విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టిన సమయంలో విద్యుత్ సర్వీసుకు ఉన్న లోడ్కు మించి విద్యుత్ వినియోగించినట్లు గుర్తిస్తే భారీగా జరిమాన విధించడం జరుగుతుందన్నారు. అదనపు లోడ్ కోసం గృహ వినియోగదారులు కిలోవాట్కు రూ.1,250, 2కిలో వాట్కు రూ. 2,450, 3 కిలో వాట్కు రూ.3,650, 4 కిలోవాట్కు రూ.4,850, 5 కిలోవాట్కు రూ.6,050 చెల్లించాల్సి ఉందన్నారు. సమీప ఎలక్ట్రికల్ రెవెన్యూ కార్యాలయంలో లేదా మీ –సేవా కేంద్రంలో ఏపీసీపీ డీసీఎల్ వెబ్సైట్లో అదనపు లోడ్కు (కిలో వాట్)తగిన చార్జి చెల్లించి అదనపు లోడ్ను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పారు. ఈ అవకాశం జూన్ 30వ తేదీ వరకు ఉందన్నారు.

క్రైస్తవ శ్మశానవాటికలను శుభ్రం చేయించాలి



చిలకలూరిపేట: ఈస్టర్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో క్రైస్తవ శ్మశాన వాటికలను శుభ్రం చేయించాలని పలువురు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానిని కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ నెల 20న ఈస్టర్ పండుగను పురస్కరించుకొని పూర్వీకుల సమాధులను అలంకరించుకోవడం ఆచారంగా వస్తున్నదని వివరించారు. పట్టణంలో ఉన్న ఐదు శ్మశానవాటికలు అపరిశుభ్రంగా ఉన్నందున వాటిని శుభ్రం చేయించటంతో పాటు శ్మశానవాటికల్లోని బోర్లను మరమ్మతు చేయించాలని కోరారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొండా వీరయ్య, మద్దుమాల రవి, జి.మాణిక్యరావు, ఎస్.శ్రీనివాసరావు, కె రమేష్బాబు, టి చందు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

వినుకొండ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలం దర్శనానికి వినుకొండ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం కోటీశ్వరరావు నాయక్ తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి 21 సోమవారం తిరుత్తణి శ్రీ కుమారస్వామి వారి దర్శనం, 12 గంటలకు శివకంచి, విష్ణుకంచి దర్శనం, 21 సోమవారం రాత్రి అరుణాచలం దర్శనం చేసుకొని గిరి ప్రదక్షణ పూర్తి చేసి 22న మంగళవారం ఉదయం గోల్డెన్ టెంపుల్, మధ్యాహ్నం 3 గంటలకు కాణిపాకం వినాయకుని దర్శనం అనంతరం తిరిగి 23 ఉదయం 4 గంటలకు వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2550లు నిర్ణయించామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా క్షేత్రాల తీర్థయాత్రలకు నెల 11వ తేదీన శుక్రవారం రాత్రి 9గంటలకు ప్రత్యే బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహానంది, బనగానపల్లె, నేలమట్టం ఆశ్రమం, యాగంటి, అహోబిలం, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, కాశీనాయన జ్యోతిమఠం క్షేత్రాల సందర్శన అనంతరం 14 సోమవారం ఉదయం 5గంటలకు వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. టిక్కెట్ ధర రూ.1600లు నిర్ణయించడమైందని, మరిన్ని వివరాలకు ఆర్టీసీ డిపోల సంప్రదించాలన్నారు.

పెరుమాళ్లపల్లి జగన్నాథం ఇకలేరు

నాదెండ్ల: కనపర్రు గ్రామ సర్పంచ్, వైఎస్సార్సీపీ నాయకుడు పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు తండ్రి జగన్నాథం (74) మంగళవారం మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయనకు భార్య, ఇరువురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచ్గా వ్యవహరిస్తున్నారు. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు సర్పంచ్లు, మండల నాయకులు జగన్నాథం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



మాచర్ల: పట్టణంలోని శ్రీ కోదండరామాలయంలో ఈ నెల 6న శ్రీరామ నవమి ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం అర్చకులు వేణుగోపాలచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు బచ్చు రామారావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. సీతారామ లక్ష్మణ స్వాములకు ప్రతి రోజూ ఉదయం 11 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొత్తూరి వెంకట బాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు

కారెంపూడి: మండలంలోని ప్రతి గ్రామంలో పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కారెంపూడి శివారు వినుకొండ రోడ్డులో గంగమ్మ గుడి వద్ద మంగళవారం నీటి తొట్టి నిర్మాణానికి ఎంపీడీఓ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాలలో నీటి తొట్లను నిర్మించనున్నట్లు చెప్పారు. గ్రామ శివార్లలో పొలాలకు వెళ్లే బాటల వద్ద బోరు నీటి సదుపాయం ఉన్న ప్రాంతాలలో వీటిని నిర్మించాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఇన్చార్జి సర్పంచ్ బాణావతు సరస్వతీభాయి, ఏపీఓ కోటిరెడ్డి, ఈఓపీఆర్డీ కసిన్యానాయక్, టీడీపీ నాయకులు తండా మస్తాన్ జాని, కటికల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాసు



నాగేంద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన కాసు

దాచేపల్లి: మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్రెడ్డి మంగళవారం మండలంలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నగర పంచాయతీలోని షేక్ పాందుగల సుభానీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుభానీ చిత్రపటానికి నివాళులర్పించారు. నారాయణపురానికి చెందిన పార్టీ నేత వేముల శ్రీహరి తల్లి నాగేంద్రమ్మ ఇటీవల మృతిచెందటంతో శ్రీహరిని పరామర్శించారు. నాగేంద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన మరో నేత కొలా నర్సిరెడ్డి గుండెపోటుతో మృతి చెందటంతో కుటుంబ సభ్యులను కాసు మహేష్రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, ఎంపీపీ కందుల జాను, నాయకులు మందపాటి రమేష్ రెడ్డి, బుర్రి విజయ్కుమార్రెడ్డి, కొప్పుల సాంబయ్య, షేక్ ఖాదర్భాషా, కొమెరబత్తిన విజయ్ కుమార్, కుందురు తిరుపతిరెడ్డి, షేక్ జాకీర్హుస్సేన్, గరిణే పుల్లారావు, దేవళ్ల రఘు, జంగాల సింగరయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంగా పదవీ విరమణ పొందడం సంతోషం

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- ఏఎస్ఐ బెనహర్బాబు దంపతులకు సత్కారం



సురేంద్రనాథ్ బెనహర్బాబు దంపతులను సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: పోలీస్ శాఖలో ఎన్నో ఆటుపోట్లను దాటుకుని ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందటం చాలా సంతోషకరమైన విషయమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బెల్లంకొండ పోలీసు స్టేషన్లో ఏఎస్ఐగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పి.సురేంద్రనాథ్ బెనహర్బాబు దంపతులకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పూలమాల వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 35 ఏళ్లపాటు సుదీర్ఘకాలం వివిధ స్థాయిల్లో పోలీస్ శాఖకు సేవలందించడం సామాన్య విషయం కాదన్నారు. అప్పట్లో నక్సలిజం, అరకొర సదుపాయాలు, రవాణా సౌకర్యాల కొరత మొదలగు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందటం గొప్ప విషయమన్నారు. దీనికి వారి కుటుంబ సభ్యుల త్యాగం, సహకారం ఉండటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. కావున వారి కుటుంబ సభ్యులకు తన అభినందనలు తెలిపారు. మీ సేవలు భావితరాలకు ఆదర్శనీయమని, దేవుడు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తి బాబు, ఏవీ కేవీవీ రామారావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ రెడ్డి, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు టి.మాణిక్యాలరావు, హోంగార్డు, వెల్ఫేర్ ఆర్ఐలు ఎస్.కృష్ణ, ఎల్.గోపీనాథ్ పాల్గొన్నారు.

ట్రాన్స్జెండర్లను అందరూ గౌరవించాలి

అంతర్జాతీయ ట్రాన్స్జెండర్ దినోత్సవం



కార్యాలయంలో ట్రాన్స్జెండర్ల మధ్యన కేక్ కట్ చేస్తున్న బెంజిమిన్

నరసరావుపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ ట్రాన్స్జెండర్లను గౌరవించాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమిన్ కోరారు. అంతర్జాతీయ ట్రాన్స్జెండర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన ట్రాన్స్జెండర్ల మధ్యన కేక్ కట్చేశారు. డైరెక్టర్ ఆనంద్ బెంజమిన్ మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్జెండర్లు అనేక సవాళ్ళు, వివక్షత ఎదురుకొంటున్నారని, వారిని సమాజంలో మనతో సాటివారిగా చూడాలని పిలుపునిచ్చారు. సమాన అవకాశాలు, హక్కులు వారికి ఉన్నాయని తెలియజేశారు. ట్రాన్స్జెండర్ వ్యక్తుల (హక్కుల రక్షణ) చట్టం, 2019 అనేది ట్రాన్స్జెండర్ వ్యక్తుల హక్కుల రక్షణ, వారి సంక్షేమం, ఇతర సంబంధిత విషయాలను అందించే లక్ష్యంతో భారత పార్లమెంట్ చేసిన చట్టమని దానిని సమాజంలో ప్రతి ఒక్కరు గౌరవించి వారిహక్కులను కాపాడాలన్నారు. సుఖవ్యాధులు, హెచ్ఐవీ అరికట్టటంలో వారు కూడా భాగస్వామ్యులు కావటం మంచి పరిణామని అన్నారు. సౌమ్య నాయిక, ఎస్ఆర్కేటీ చాందిని, అంకిత మాట్లాడారు. పీఎం ఉదయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు



బైకు యాత్రలో పాల్గొన్న నాయకులు

నూజెండ్ల: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కారమై జరుగుతున్న బైకు యాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు కోరారు. ఉపాధి పథకంలో కూలీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న బైకు ర్యాలీ మంగళవారం నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఆరు వారాలుగా వేతనాలు జమ కావటం లేదని పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించటం లేదన్నారు. ఈనెల 5న ర్యాలీ ముగింపు జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు జరుగుతున్న వాటి గురించి జిల్లా ఉపాధి పీడీ దృష్టికి తీసుకొని వెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం మండల ఏపీవో ఆంజనేయరాజు కలిసి ఉపాధి కూలీల సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రోశయ్య, నాగేశ్వరరావు, భరత్, ఆశార్వాదం, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

తిరునాళ్లలో దొంగల చేతివాటం

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో గత నెల 30న జరిగిన శ్రీఅడవి పేరంటాలమ్మ తిరునాళ్ల వేడుకల్లో బైకులు, సెల్ఫోన్లు, చోరీకి గురైనాయి. తిరునాళ్ల వేడుకల్లో పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసిన కూడా దొంగలు ద్విచక్రవాహనాలు, సెల్ఫోన్లు చోరీ చేయటంతో బాధితులు లబోదిబో మంటూ పోలీసు స్టేషనులో ఫిర్యాదులు చేశారు. స్థానిక ఎస్సై లేళ్ల లోకేశ్వర రావు మాట్లాడుతూ బైకులు, సెల్ఫోన్లు చోరీకి గురైనా వారందరు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.